క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సీతారాంపురం సెక్షన్ మారుతీనగర్ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతీనగర్ కాలువ గట్టు, చుట్టుగుంట కాలువ గట్టు, సిమెంట్ రోడ్డు, బీఎస్ఎన్ఎల్ భవన్, కాకర్ల వారి వీధి, వీరయ్య వీధి, మాగంటి వారి వీధి, మసీదు వీధి, గద్దె పూర్ణచంద్రరావు వీధి, ప్రకాశరావు వీధి, అనుమోలు శేషగిరిరావు వీధి, గోగినేని వారి వీధి, మిల్క్ బూత్ స్ట్రీట్, పటేల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువులు



రామవరప్పాడు: ఇటీవల సంభవించిన వరదల్లో నష్టపోయిన బాధితులకు రామవరప్పాడులోని టీజీఆర్ ట్రస్ట్ అండగా నిలిచింది. నగరంలోని వాంబే కాలనీ, రాజీవ్‌నగర్, జక్కంపూడి, భవానీపురం ప్రాంతాల్లోని బాధితులకు ఎనికేపాడులోని షాలోమ్ ఇవాంజెలికల్ ఫెలోషిప్ చర్చిలో మంగళవారం టీజీఆర్ ట్రస్ట్ నిత్యావసర వస్తువులు అందజేసింది. పూర్తిగా నష్టపోయిన 150 మంది బాధితులకు 1,750 కుర్చీలు, 350 కార్పెట్స్, 150 బస్తాల రైస్, నిత్యావసర కిట్లను సభ్యులు అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ తుమ్మల సత్యం మాట్లాడుతూ.. వరదల సమయంలో వరద ప్రాంతాల్లో సంచరించి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ప్రస్తుతం తీవ్రంగా నష్టపోయిన బాధితులకు తమ వంతు ఆదుకునేందుకు నిత్యావసర కిట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వంగూరి సురేష్, కందుల కుమారి, సింధు శోభిత తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి మానవ హక్కుల కేసులు బదిలీ చేయాలి

హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు షేక్ మౌలాలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రం విడిపోయి పదేళ్లు గడిచినా ఇంకా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన మానవ హక్కుల కేసులు తెలంగాణ నుంచి ఇక్కడకు రప్పించుకోలేకపోవడం బాధాకరమని హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు షేక్ మౌలాలి అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సింగ్‌నగర్‌లోని హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జాతీయ కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగింది. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్పందించి మానవ హక్కుల కేసులను తెలంగాణ నుంచి ఏపీకి బదిలీ అయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్కే సద్దాం, నాయక్, ఎస్కే వలి, శ్రీనివాసరావు,జి.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి



వించిపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో మోయలేని భారాలు మోపిందని, వెంటనే వాటిని రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు డిమాండ్ చేశారు. సీపీఎం విజయవాడ పశ్చిమ నగర 24వ మహాసభ వించిపేట, గొల్లపాలెంగట్టులో జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలన ప్రజలను తీవ్ర నిరాశ పర్చిందన్నారు. 10 ఏళ్ల మోదీ పాలన దేశాన్ని, రాష్ట్రాన్ని నిండా ముంచేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం గెలిచిన ఆరు నెలల్లో రూ.67 వేల కోట్లు అప్పులు చేసిందని ఆరోపించారు. విద్యుత్ చార్జీలతో పాటు రాష్ట్ర హైవేల మీద కూడా టోల్ బాక్స్ పెడతామని చెప్పడం సిగ్గు చేటన్నారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో ఒక్క పెన్షన్లు పెంపు తప్పు మిగిలిన హామీలు అమలు జరగలేదన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన సహాయాన్ని పొందడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని విమర్శించారు. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఎన్నికలలో గెలవటానికి రూ.కోట్లు ఖర్చుచేసి ఇప్పుడు అవి వసూలు చేసుకునే పనిలో పడ్డారని విమర్శించారు.

బుడమేరు వరద వచ్చి 100 రోజులు పూర్తయినా నేటికి బాధితులకు నష్టపరిహారం అందకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు, మాజీ కార్పొరేటర్ గాదే ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్లాదం.. ఆనందం.. ఆమడదూరం

అధ్వానంగా లెనిన్‌సెంటర్ ఐలాండ్ పార్క్

- నిర్వహణను గాలికి వదిలేసిన కార్పొరేషన్
- పార్క్ లోపలి భాగంలో చెత్త, పశువుల వ్యర్థాలు
- దెబ్బతిన్న విద్యుత్ దీపాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరం నడిబొడ్డున లెనిన్‌సెంటర్‌లో నిర్మించిన ఐలాండ్ పార్క్ నిర్వహణను కార్పొరేషన్ గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్క్‌ను సక్రమంగా నిర్వహించడం లేదు. దీంతో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన పార్క్ అధ్వాన స్థితికి చేరుకుంది. లోపలకు అడుగు పెట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి ఉంది. ఎక్కడ చూసినా పశువుల వ్యర్థాలతో కంపు కొడుతోంది. పార్క్‌లో ఆహ్లాదం, ఆనందం రెండూ కరువయ్యాయి.

ప్రజలు సేదదీరడానికి

లెనిన్ సెంటర్ వ్యాపార, వాణిజ్య కూడలి. నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలనుంచి ఇక్కడికి వచ్చేవారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. సాధారణ రోజుల్లోనే రద్దీ వాతావరణం కనిపిస్తుంది. ఇక ప్రత్యేక దినాల్లో ఇసుకేస్తే రాలనంత జనం. బట్టలు, బంగారం, ఫర్నిచర్ ఇలా ఏ వస్తువు కావాల్సిన వారైనా, ఎక్కడి వారైనా లెనిన్‌సెంటర్‌కు వచ్చి కొనుగోలు చేస్తుంటారు. ఇక్కడకు వచ్చే వారు సేద తీరేందుకు గానీ, కాసేపు పిల్లలతో గడిపేందుకు గానీ ఇక్కడ సరైన అవకాశం లేదు. ఇది గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లెనిన్ విగ్రహం ముందు వెనుక స్థలంలో ఆక్రమణలు తొలగించింది. దీన్ని పార్క్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించింది. వెంటనే పార్క్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ. 75 లక్షల వ్యయ అంచనాతో పార్క్ నిర్మించింది. లెనిన్ సెంటర్ ఐలాండ్ పార్క్‌గా నామకరణం చేసింది. ఇక్కడకు షాపింగ్ వచ్చిన


పార్క్ లోపలి భాగంలో చెత్త కుప్ప

నేడు వెలవెల

పిల్లలకు ఆట వస్తువులు, కాకి– కడవ , మొసలి వేలాడే కోతి వంటి బొమ్మలను ఏర్పాటు చేసింది. పార్క్ చుట్టూ సీటింగ్ అమర్చింది. షాపింగ్ చేసిన వారంతా కాసేపు కూర్చొని వెళదాం అనే భావన కలిగేలా సకల సౌకర్యాలు కల్పించింది. కాకి– కడవ కథ ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా బొమ్మలు ఏర్పాటు చేసి దాని చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసింది. అన్ని హంగులతో కళకళలాడిన ఐలాండ్ పార్క్ ఇపుడు వెలవెలబోతోంది.


పార్క్‌లో ఎక్కడబడితే అక్కడ పశువుల వ్యర్థాలు

పిల్లలు, పెద్దలు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని, ఆహ్లాదాన్ని పంచే విధంగా పార్క్‌లో సౌకర్యాలు తీర్చిదిద్దింది.

నిర్వహణ ఏదీ?


కాకి కడవ బొమ్మలు దాని చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు దెబ్బతిన్న దృశ్యం

కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన తర్వాత పార్క్ నిర్వహణను కార్పొరేషన్ పూర్తిగా గాలికి వదిలేసింది. పార్క్‌ను విస్మరించడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. లోపలి భాగంలో చెత్త.. కుప్పగా పేరుకుపోయింది. పచ్చదనం కరువై ఎక్కడ చూసిన పశువుల వ్యర్థాలతో నిండిపోయింది. పార్క్‌లో అడుగు పెడదామంటేనే భయపడేలా నిర్వహణ తయారైంది. కాకి–కడవ బొమ్మలను విరగ్గొట్టారు. దాని చుట్టూ ఏర్పాటు చేసిన అందమైన విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పశువుల పేడ, వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతోంది. తాగుబోతులు, పులిమేక ఆడే ఆకతాయిలతో నిండిపోయింది. నగరం నడిబొడ్డులో ఉన్న పార్క్ నిర్వహణను కార్పొరేషన్ గాలికి వదిలేయడంపై చుట్టు పక్కల వ్యాపార సముదాయాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్క్ అధ్వానంగా తయారై పాత రోజుల్లో మాదిరి తయారయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పార్క్‌ను తీర్చిదిద్దాలని కోరుతున్నారు. దెబ్బతిన్న ఆట వస్తువుల స్థానే కొత్తవి ఏర్పాటు చేయాలని, మిగిలిపోయిన పనులను పూర్తి చేసి నగరానికి వచ్చే వారు చక్కగా సేద తీరేలా చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

ఉత్సాహంగా స్విమ్మింగ్ పోటీలు



విజయవాడస్పోర్ట్స్: రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని సర్ విజ్జి మునిసిపల్ కార్పొరేషన్ స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు మంగళవారం ఉత్సాహంగా సాగాయి. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి 170 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్, కార్యదర్శి బత్తుల సుందర్‌రెడ్డి, యూత్ సర్వీస్ ఉపాధ్యక్షుడు నండూరి త్రినాథ్, సంయుక్త కార్యదర్శులు మద్దినేని శ్రీనివాస్, ఎడ్ల పార్థసారథి గెలుపొందిన క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్ టౌన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, దీనిలో భాగంగానే స్విమ్మింగ్ పోటీలు నిర్వహించామని క్లబ్ అధ్యక్షులు కిషోర్ ఈ సందర్భంగా తెలిపారు. క్లబ్ ప్రతినిధులు సాగర్, దేవా, బాచి, విష్ణు, తొండేపు ఉదయ్ పోటీలను పర్యవేక్షించారు.

దాసాంజనేయుడికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీదాసాంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు దాసాంజనేయుడిని దర్శించుకున్నారు. వాహన చోదకులు పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి పర్యవేక్షించారు.

రోడ్ల నిర్మాణ ప్రాంతాల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలో నాణ్యతా ప్రమాణాలతో రోడ్ల నిర్మాణాలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో త్వరలో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ ప్రాంతాలను పరిశీలించారు. సర్కిల్–1 పరిధిలోని బీఆర్పీ రోడ్, నెహ్రూ రోడ్, కేటీ రోడ్, కుమ్మరిపాలెం, సితార సెంటర్ నుంచి సీవీఆర్ ఫ్లైఓవర్, మొత్తం 7.37 కిలోమీటర్ల రోడ్లను, సర్కిల్–2 పరిధిలోని బీఆర్టీఎస్ రోడ్, సాంబమూర్తి రోడ్, జీఎస్ రాజు రోడ్, 7.26 కిలోమీటర్ల రోడ్లను, సర్కిల్–3 పరిధి లోని పటమట హైటెన్షన్ లైన్ రోడ్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్, టిక్కిల్ రోడ్, సిద్ధార్థ స్కూల్ రోడ్, జమ్మి చెట్టు సెంటర్ నుంచి సిద్ధార్థ సర్కిల్ వరకు, మదర్‌థెరిసా సర్కిల్ నుంచి అమ్మ కల్యాణ మండపం వరకు, పీవీపీ మాల్ రోడ్, రమేష్ హాస్పటల్ ప్రాంతాల్లో జరుగుతున్న 8.37 రోడ్లను పరిశీలించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, ఏపీ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ సభ్యులు, పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

రేపు ఎస్ఆర్ఆర్‌లో జాబ్ మేళా

మధురానగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జేకేసీ, జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ – సీడాప్ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 12వ తేదీ గురువారం ఎస్ఆర్ఆర్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్. శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి. విక్టర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిఉన్నవారు వివరాలకు 77996 69907 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

అక్రమ కట్టడాల తొలగింపు

సింగ్‌నగర్, న్యూఆర్ఆర్‌పేటలోని అనధికార నిర్మాణాలపై చర్యలు తీసుకున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ సెంట్రల్): సింగ్‌నగర్, నందమూరినగర్, న్యూరాజరాజేశ్వరీపేట పరిసర ప్రాంతాల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర కన్నెర్ర చేశారు. నిబంధనలకు విరుద్ధంగా.. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ 57, 58 డివిజన్లలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వివరిస్తూ మంగళవారం 'అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు' అనే శీర్షికతో 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై కమిషనర్ స్పందించారు. ఆయా డివిజన్లలో జరుగుతున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా టౌన్‌ప్లానింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ సెంట్రల్ ఏసీపీ రాంబాబు, టీపీఎస్ మథిన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయా భవనాలను గుర్తించి కొన్నింటిపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా టీపీఎస్ మథిన్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ కట్టడాలను నిర్మిస్తే ఉపేక్షించబోమని.. తొలిరోజు మూడు భవనాలను రిమూవ్ చేశామని.. మిగిలిన వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని వివరించారు.


ఇందిరానాయక్‌నగర్‌లో అక్రమ కట్టడాలను తొలగిస్తున్న సిబ్బంది

వన్ వేతో ఇక్కట్లు!


శారద కాలేజీ జంక్షన్ వద్ద ఎన్నార్పీ రోడ్డులో వన్‌వే

ఎస్ఎన్‌పురం ప్రజల అసహనం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సత్యనారాయణపురం ఎనార్పీ రోడ్డులో వన్ వే ఏర్పాటుచేయడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి వన్ వే ఏర్పాటుసరిపోతుందా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నగరంలోని రద్దీ ప్రాంతాల్లో ఎన్నార్పీ రోడ్డు ఒకటి. ఈ రోడ్డులో జాతీయ, ప్రైవేటు బ్యాంకులు, చెప్పులు, కిరాణా షాపులు ఉన్నాయి. ఈప్రాంతం కొనుగోలు దారులతో రద్దీగా ఉంటుంది. దీనికితోడు హాకర్లు తోపుడు బండ్లను రోడ్డు మీద పెట్టి వ్యాపారాలు చేసుకోవడంతో సమస్య మరింత తీవ్రం మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో మరీ ఇబ్బందిగా ఉంటోంది. అంతేకాకుండా బీఆర్టీఎస్ రోడ్డు, జీఎస్‌రాజు రోడ్డులో దారిపక్కన రోజుల తరబడి వాహనాలు నిలిపేస్తున్నారు. అయినా ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఫలించని వన్ వే..

ఎన్నార్పీ రోడ్డులో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతుండటంతో వాటికి చెక్ పెట్టడానికి త్రీ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. శారద కళాశాల జంక్షన్ నుంచి ఎన్నార్పీ రోడ్డుకు వెళ్లే మార్గంతో పాటు ప్రభాస్ కళాశాల నుంచి వచ్చే వాహనాలను శివాలయం రోడ్డుకు వెళ్లే దారిలో బారికేడ్లు ఏర్పాటు చేసి వన్ వే నిబంధన అమలు చేశారు. దీనిపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎవరినీ సంప్రదించకుండా చర్యలు తీసుకోవడం సరికాదని చెబుతున్నారు. ఈ రోడ్డులో అనాధికారిక పార్కింగ్, హాకర్లను నివారిస్తే సమస్య తీరిపోయేదని, కానీ ట్రాఫిక్ పోలీసులు వన్ వే నిబంధనపెట్టడంతో ఇదే ప్రాంతంలోని నివసిస్తున్న వేలాది మంది ఇబ్బందులు ఎదుర్కోవాల్సివస్తుందని ఆరోపిస్తున్నారు. దీంతో చుట్టూ తిరిగా రావాల్సి వస్తోందని వాపోతున్నారు.

అన్ని వర్గాలను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలి



ట్రాఫిక్ పోలీసులు ఏకపక్షంగా వన్ వే నిబంధన పెట్టడం సరికాదు. స్థానిక ప్రజాప్రతినిధి, వ్యాపారస్తులు, స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోవాలి. వన్ వే నిబంధనలు పెట్టిన ట్రాఫిక్ పోలీసులు స్థానికులకు ప్రత్యామ్నాయ మార్గాలు, ఏ వీధిలోకి వెళ్లాలనే సూచికల బోర్డులు ఏర్పాటు చేయాలి. మరో వైపు ఈ నిబంధనల కారణంగా ఇరుకు సందుల్లో సైతం వాహనచదోకులు రాకపోకలు సాగిస్తుండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా వీధుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– శర్వాణిమూర్తి, కార్పొరేటర్, 33వ డివిజన్


అనాధికారిక పార్కింగ్‌లు, హాకర్లతో ఇరుకుగా మారిన ఎన్నార్పీ రోడ్డు

భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద

విజయవాడకల్చరల్: భగవద్గీత భారతీయ ఆధ్యాత్మిక సంపద అని ఇస్కాన్ సంస్థ ప్రతినిధి వజ్రదాస్ గురూజీ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీలు, విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను మంగళవారం చుట్టగుంటలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో నిర్వహించారు. వజ్రదాస్ మాట్లాడుతూ భగవాన్ శ్రీ కృష్ణుడు మనకు అందించిన వరం భగవద్గీత అని నిత్య పారాయణ గ్రంథం కావాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్, బొగ్గవరపు రాధాకృష్ణ, వాసవీ క్లబ్ మాజీ గవర్నర్, మిత్తింటి శారద, వాసవీ క్లబ్ సభ్యుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు. విష్ణుభొట్ల లక్ష్మీనారాయణ, పాక్కులూరి సుబ్బారావు, టి.సావిత్రి, ఆర్.సావిత్రి కనకదుర్గ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.


భగవద్గీత పోటీల్లో విజేతలతో ధర్మప్రచార పరిషత్ సభ్యులు

విజేతలు: జూనియర్ విభాగం సంపూర్ణ భగవద్గీత పోటీలో దీక్షిత(ప్రథమ), సీనియర్ విభాగంలో పి.లక్ష్మీ ప్రసన్న(ద్వితీయ), వీవీఎస్ శ్రీధర్ శర్మ (తృతీయ), సీనియర్ విభాగంలో లక్ష్మీప్రసన్న(ప్రథమ), వీవీఎస్ శ్రీధర్ శర్మ(ద్వితీయ), ఎం.దివ్యసాహితీ (తృతీయ)కి నిర్వాహకులు బహుమతులను అందజేశారు.

స్కేటింగ్ జాతీయ పోటీల్లో జెస్సీరాజ్‌కు సిల్వర్

విజయవాడస్పోర్ట్స్: జాతీయ 62వ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ క్రీడాకారిణి మాత్రపు జెస్సీరాజ్ సత్తా చాటింది. తమిళనాడు రాష్ట్రం పోలాచి నగరంలోని కేశవ విద్యా మందిర్ స్కేటింగ్ పార్క్‌లో స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు పోటీలను నిర్వహించింది. దేశవ్యాప్తంగా వెయ్యి మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. 14 నుంచి 17 ఏళ్ల విభాగం సోలో డాన్స్‌కు జెస్సీరాజ్ ఏపీకి ప్రాతినిధ్యం వహించి రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. జెస్సీరాజ్ పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఆమెను ఆర్టిస్టిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రదీపక్ మాల్వాయి, ఏపీ ఆర్టిస్టిక్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ ఆకుల ప్రవీణ్‌కుమార్, ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి తామస్ చౌదరి, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. దీంతో జెస్సీ 50 పతకాల మైలురాయిని చేరుకుంది.


పోటీల్లో రెండో స్థానం సాధించిన జెస్సీరాజ్

ఆటో ఢీ కొని ఒకరికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆటో ఢీ కొని ఒకరికి గాయాలైన ఘటనపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురానికి చెందిన లింగాబత్తిన సుశీల, సుధాకర్‌రావు భార్యభర్తలు. సుధాకర్‌రావు తాపీ మేస్త్రీగా పని చేస్తుండగా, సుశీల ఆర్‌సీఎం స్కూల్‌లో వంట పని చేస్తుంటోంది. ఈ నెల 2వ తేదీ రాత్రి 8.20 గంటల సమయంలో సుధాకర్‌రావు పాముల కాల్వ వద్ద కీర్తి బార్ వద్ద నిల్చుని ఉండగా, గుర్తు తెలియని ఆటో వచ్చి ఢీ కొట్టింది. దీంతో సుధాకర్‌రావుకు గాయాలు కాగా మంగళగిరి ఎయిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. సుశీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు ఉపయుక్తం.. అటల్ ఎఫ్‌డీపీ



అటల్ ఎఫ్‌డీపీ పర్యటనలో అధ్యాపకుల బృందం

విజయవాడస్పోర్ట్స్: అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.సాంబశివరావు తెలిపారు. ఎన్ఆర్ఐ కాలేజీ చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ ప్రోత్సాహంతో 50 మంది అధ్యాపకులు బృందం అవెరా విద్యుత్ వాహన పరిశ్రమను మంగళవారం పరిశీలించింది. విద్యుత్ వాహనాల తయారీ ప్రక్రియ, మోటారు సిస్టం, బ్యాటరీ టెక్నాలజీ, నూతన ఆవిష్కరణలను ఈ బృందం ప్రత్యక్షంగా చూసినట్లు కో ఆర్డినేటర్ చెప్పారు. విద్యార్థులకు గుణాత్మక బోధన అందించడానికి, నైపుణ్యాలను పెంచుకోవడానికి అధ్యాపకులకు ఈ పర్యటన దోహదపడుతుందని చెప్పారు.

విద్యుత్ స్తంభాలకు అల్లుకున్నాయి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణాపురం దేవీనగర్ రోడ్డులో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఇక్కడ విద్యుత్ స్తంభాలపైకి పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెగ్యులర్‌గా విద్యుత్ స్తంభాల వద్ద పిచ్చిమొక్కలు, మొక్కల తీగలు తొలగించేవారు. కొంతకాలంగా పట్టించుకోకపోవడంతో మళ్లీ పెరిగిపోయి విద్యుత్ స్తంభాలపైకి అల్లుకుంటున్నాయి. వర్షాలు, గాలులు వీచినప్పుడు విద్యుత్ స్తంభాల నుంచి మంటలు వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ దారిలో విద్యుత్ స్తంభం బుడమేరు వైపు ఒరిగిపోయి ఉంది. అధికారులు స్పందించి ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

